క్లుప్తంగా

నిర్మల్ ఏడీఏగా భాస్కర్



నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయశాఖ నిర్మల్ డివి జన్ ఏడీఏగా వి.భాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏగా పని చేసిన వినయ్ బాబు బదిలీపై ముధోల్ ఏడీఏగా వెళ్లారు.

నేడు విద్యుత్ బంద్

నిర్మల్‌చైన్‌గేట్: మరమ్మతుల నేపథ్యంలో 11కేవీ గాజులపేట ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గాజులపేట, కొమ్ము నారాయణ రైస్‌మిల్, మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయం, బైల్ బజార్, డాక్టర్స్ లేన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెండి వీణ బహూకరణ



వెండి వీణ బహుకరిస్తున్న దంపతులు

బాసర: మండల కేంద్రంలోని సరస్వతి అమ్మవారికి లోకేశ్వరం మండలం గడ్‌చాంద గ్రామానికి చెందిన దమ్మన్నగారి కవిత–నాగేంద్రావు దంపతులు అరకిలో వెండితో తయారు చేసిన వీణను ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్‌కు అందజేశారు. వీరికి అర్చకులు అమ్మవారి హారతి, తీర్థప్రసాదం అందించి ఆశీర్వదించారు.

కేజీబీవీ సందర్శన



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీవో

లక్ష్మణచాంద: మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందించాలని ఎంపీడీవో రాధ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఏవైనా ఇబ్బందుంటే తనకు చెప్పాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో నవిత తదితరులున్నారు.

'నేతకానీలకే పదవి ఇవ్వాలి'

కడెం: నేతకానిలకే ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని నేతకాని సంఘం మండల ప్రధాన కార్యదర్శి దుర్గం గంగాధర్ ఓ ప్రకటనలో కోరారు. నియోజవర్గంలో నేతకానిల ఓట్లు ఇరవై వేలకు పైగా ఉన్నాయని.. నేతలకానిలకు పదవి ఇచ్చి రాజకీయంగా ముందుకు నడిపించాలని కోరారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహనగర్‌లో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాలి

కుంటాల: ప్రభుత్వ నిబంధనల మేరకు ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. 2020కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు శుక్రవారం క్షేత్రస్థాయిలో ప్లాట్లను పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ రమేశ్, ఆర్ఐ అడెల్లు, కార్యదర్శి రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

అన్నాభావుసాఠే జయంతి



వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

కుభీర్: మండలంలోని గోడాపూర్ గ్రామంలో సాహిత్యరత్న అన్నాభావేసాఠే 104వ జయంతి నిర్వహించారు. దళిత సమాజానికి వారు చేసిన సేవలను కొనియాడారు. మాజీ సర్పంచ్‌లు దిగంబర్ పటేల్, బాపురావ్ పటేల్, పంచాయతీ కార్యదర్శి కవిత, రామారావ్, చక్రధర్, ఉత్తమ్ తదితరులు ఉన్నారు.

వీధిదీపాల ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు వీధిదీపాలు లేకపోవడంతో ప్రజలు రాత్రి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిలర్ పరిమి లతసురేశ్ దగ్గరుండి మున్సిపల్ సిబ్బందితో వీధిదీపాలు, డీపీలు ఏర్పాటు చేయించారు. డీపీ ద్వారా లైట్లు ఆనాఫ్ చేసుకునే వీలుంటుందని సిబ్బంది తెలిపారు.

ఏళ్లుగా ఎదురుచూపులే..

- 'బీటీ' కోసం నిరీక్షిస్తున్న గ్రామస్తులు
- మట్టిరోడ్డుపై రాకపోకలకు ఇబ్బంది పడుతున్న రెండు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా కథ్‌గాం మీదుగా కామోల్ వెళ్లే రోడ్డు



కథ్‌గాంలో మట్టి రోడ్డు

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహదారికి మూడు కిలోమీటర్ల దూరంలోనే కథ్‌గాం గ్రామం ఉంది. ఈ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని ఏళ్లుగా స్థానికులు కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రత్యేక రాష్ట్రంలో కథ్‌గాం మీదుగా కామోల్ గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు నిర్మించారు. అందులో మిగిలిన నిధులతో కామోల్ వైపు నుంచి కిలోమీటరు మేర బీటీ రోడ్డు వేశారు. మిగతా నాలుగు కిలోమీటర్ల మేర మట్టిరోడ్డే ఉంది. కామోల్ గ్రామస్తులకు దేగాం మీదుగా డబుల్ రోడ్డు ఉండటంతో రాకపోకలు సాగిస్తున్నారు. భైంసా పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కథ్‌గాంవాసులకు వేరే రోడ్డు లేదు. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వర్షాకాలంలో కష్టాలు..

ఏటా వర్షాకాలంలో మట్టి రోడ్డు బురదమయంగా మారుతోంది. దీంతో రాకపోలకు కథ్‌గాంవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలోనే ఫ్యాక్టరీలు, వ్యాపారసంస్థలు ఉన్నప్పటికీ బీటీ రోడ్డు నిర్మించలేదు. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డుపై ఆటోలు కూడా వెళ్లే పరిస్థితి ఉండదు. పైగా కథ్‌గాం గ్రామంలో ఉండే పాఠశాల విద్యార్థులంతా భైంసా పట్టణానికే వచ్చి చదువుకుంటారు. పట్టణానికి ఆనుకుని ఉండడంతో ఈ గ్రామ యువత భైంసాకే వచ్చి పనులు చేస్తుంటారు. గ్రామంలోని 70శాతం మంది నిత్యం భైంసాకే వచ్చిపోతున్నా.. రోడ్డు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

భైంసా నుంచి కథ్‌గాం మూడు కిలోమీటర్ల మేర.. కథ్‌గాం నుంచి కామోల్ వరకు ఐదు కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



ఏళ్లుగా ఇబ్బందులు పడుతునే ఉన్నాం. కథ్‌గాం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని అధికారులకు విన్నవించాం. ఎవరూ పట్టించుకో వడం లేదు. ఏటా వర్షాకాలంలో రాకపోకలకు కష్టమవుతుంది. గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలి. – మారుతి, కథ్‌గాం

ఇబ్బంది పడుతున్నాం



కొన్నేళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులపాలవుతున్నాం. బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకో వడం లేదు. చుట్టూ తిరిగి దేగాం నుంచి భైంసా వెళ్తున్నాం. కథ్‌గాం రోడ్డు పూర్తయితే దూర భారం తగ్గుతుంది. – అక్షయ్, కామోల్

గతంలో విన్నవించినా..

గతంలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన కథ్‌గాం గ్రామంలో కలెక్టర్లుగా పనిచేసిన ప్రశాంతి, ముషారఫ్ అలీఫారూఖీ, వరుణ్‌రెడ్డి పర్యటించారు. గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. చేసేదేం లేక గ్రామస్తులు ఇటీవల నిరసనకు దిగారు. భైంసా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, పట్టణ సీఐ రాజారెడ్డి గ్రామస్తుల వద్దకు వెళ్లి ఆందోళన విరమింపజేశారు. అధికారులకు వినతిపత్రం ఇచ్చి బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు.

సీపీఎస్ రద్దు చేయాలి

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన ఉద్యోగులు



భైంసాలోని జూనియర్ కళాశాలలో..



కుభీర్‌లో ప్రతులు దహనం చేస్తున్న అధ్యాపకులు



కడెం: లింగాపూర్‌లో నినాదాలు చేస్తున్న టీచర్లు



మామడలో..

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు శుక్రవారం పెన్షన్ విద్రోహం దినం పాటించారు. ఈసందర్భంగా జీవో నం.28 ప్రతులను కాల్చి నిరసన తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాలు హరించే సీపీఎస్ రద్దు చేసి.. పాత పెన్షన్ విధానం అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భూషణ్‌పాండే, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: సీపీఎస్ రద్దుకు కుంటాలలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 28 ప్రతులను కాల్చివేసి నినాదాలు చేశారు. సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణా రావు ఎంపీడీవో ఎంఏ రహీం, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, తిరుపతిగౌడ్, రాజ బాపు, ప్రవీణ్, నితిన్, తిరుపతిరెడ్డి, అఖిల్, స్వర్ణలత, కృష్ణ, జ్యోతి, సుధారాణి, బేబీరాణి పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంతోపాటు పాటు సేవాలాల్‌తండా గ్రామాల్లో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కడెం: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులు డిమాండ్ చేశారు. మండలంలోని లింగాపూర్ జెడ్పీ పాఠశాల, కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కుభీర్: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఎదుట అధ్యాపకులు సీపీఎస్ అమల్లోకి తెచ్చిన ఆగస్టు 23ను బ్లాక్ డేగా ప్రకటిస్తూ జీవో ఎంఎస్ 28 ప్రతులను దహనం చేశారు. అధ్యాపకులు సంపత్, శివరాజ్, నర్సయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ పట్టణంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజేందర్, రాజేశ్వర్, అరుణ, జంగు, సుమలత, ఈశ్వర్, శ్యాం తదితరులు ఉన్నారు.

తానూరు: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం జీవో 28 జీవో పత్రులను దహనం చేశారు. హరీశ్, శంకర్, మాధవ్‌రావ్, సుజాతదేవి, రజనీకాంత్, లక్ష్మి పాల్గొన్నారు.

మామడ: ఓపీఎస్ పునరుద్ధరించాలని మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పొన్కల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, కొరిటికల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వద్యాల్‌లో నీటిని పారబోయిస్తున్న అంబాజీ


తానూరు: దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో పర్యటించారు. పల్లె ప్రకృతివనం పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్, కార్యదర్శి లక్ష్మణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు. పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు నిర్వహించాలని మండల ప్రత్యేకాదికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల వివరాలను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో అబ్దుల్ సమద్, సిబ్బంది ఉన్నారు.

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని దౌనెల్లి, కుంటాల, అందాకూర్, ఓలా, అంబకంటి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు సాయేందర్, రాజబాపు, యోగేశ్, రమ్య, సుమన్ ఉన్నారు.

లక్ష్మణచాంద: రోగాల బారిన పడకుండా పరిసరాల్లో నిల్వనీటిని పారబోయాలని మండల ప్రత్యేకాధికారి జాదవ్ అంబాజీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వద్యాల్ గ్రామంలో పలు ఇళ్లలో నిల్వనీటిని పారబోయించారు. అనంతరం లక్ష్మణచాంద కేజీబీవీ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో రాధ, ఎంపీఓ అమీర్‌ఖాన్, ఎస్‌ఓ నవిత, ఏపీవో ప్రమీల, టీఏ దినేశ్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో మూడు వారాలుగా ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పారిశుధ్యం, వైద్యం తదితర అంశాలపై ప్రజలకు పంచాయతీ అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం వివిధ వార్డుల్లో పీహెచ్‌సీ సిబ్బంది పర్యటించి జ్వర పీడితుల వివరాలను నమోదు చేసుకున్నారు. పలు ప్రాంతాల్లో నీటికుంటలు, నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించారు. కార్యక్రమంలో పీఎహెచ్ఎం దుర్గాభవాని, ఏఎన్ఎంలు సౌందర్య, పుష్ప, ఆశా కార్యకర్త జె.శోభ తదితరులు పాల్గొన్నారు.

బాధతో పంటను తొలగించారు



రెండు రోజుల కిందట మొక్కజొన్న చేను



ప్రస్తుతం దుక్కిగా మారి ఇలా..

- చేనులో పెరిగిన కలుపు
- 10 ఎకరాల్లో మొక్కజొన్న పంటను దున్నేసిన పొట్టపెల్లి(కే) రైతులు

లక్ష్మణచాంద: దిగుబడి రాదనే బాధతో ఆరుగాలం కష్టించి సాగు చేసిన మొక్కజొన్న చేనును తొలగించారు. మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామంలో చెందలి నర్సయ్య, జగదీశ్‌రెడ్డి, ఇన్నయ్య, చిన్న బక్కన్న, పోతుగంటి బక్కన్న, ఇల్లసరం మహేశ్ రైతులు ఈ వర్షాకాలంలో సుమారు పదెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. కానీ ఈ సారి తరచుగా వర్షాలు కురువడంతో చేనులో నీరు నిలిచి కలుపుమొక్కలు పెరిగాయి. ఇప్పటికే రెండు సార్లు యూరియా వేసినా పంటలో ఎదుగుదల కన్పించలేదు. దీంతో రైతులు చేసేదేం లేక శుక్రవారం పంటను ట్రాక్టర్‌తో తొలగించారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే పెట్టుబడులు నష్టపోయామని.. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

సన్మానం

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌ను స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల అధ్యాపకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అధ్యాపకులు డాక్టర్ సంజీవ్‌కుమార్, శంకర్, పురుషోత్తం, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ బీపీఎంగా పని చేస్తున్న రెడ్ల బాలాజీని శుక్రవారం ముధోల్ తపాలాశాఖ కార్యాలయంలో సన్మానించారు. బాలాజీ ఇటీవల భగవద్గీతలోని గీత శక్తి పుస్తకం రచించిన సందర్భంగా వారిని సన్మానించారు. ఎస్పీఎం గంగయ్య, సిబ్బంది భోజన్న, గంగరాజు, వెంకటేశ్, అశోక్ ఉన్నారు.

కుంటాల: నూతన ఎస్సై సీహెచ్.భాస్కరాచారిని మండల అంబేద్కర్ సంఘ సభ్యులు కలిసి సన్మానించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, సభ్యులు సాయిలు, జగదీశ్, రాజ్‌కుమార్, కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న ఫిర్దోస్ జబీన్

భైంసాటౌన్: పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్ జబీన్, డాక్టర్ కమలేశ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి.. జలుబు, దగ్గు, జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. పరిసరాల్లో మున్సిపల్ సిబ్బందితో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. హెచ్‌ఈవో కలీముద్దీన్, ఎస్‌వో జ్యోతి, తదితరులున్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



లోకేశ్వరం: వ్రతం చేస్తున్న భక్తులు



నిర్మల్‌చైన్‌గేట్: వ్రతం చేస్తున్న మహిళలు



కుభీర్‌లో..

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర చైతన్య విద్యా మందిర్ పాఠశాలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహిళలు పూజలు చేశారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీ సరస్వతీ శిశుమందిర్ బుధవార్‌పేట పాఠశాలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. గౌరిపూజ, వరలక్ష్మి వ్రత విధానం శ్రీధర్ పంతులు వివరించారు. సద్ది శ్రీ వాణి అమ్మవారి విశిష్టత, సమాజంలో ఎలా మెలగాలో వివరించారు. శ్రీ అప్పాల శశికళ, అప్పాల అనురాధ, ప్రధానాచార్యులు శ్రీ కొండూరు నరేశ్, పోషకులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర్ మందిరంలో శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం సాముహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. దీనికి ముఖ్యవక్తగా తపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రాజేశ్వర్ హాజరై వ్రతం విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో పూజారి సురేశ్, ప్రధానోపాధ్యాయుడు హన్మండ్లు, ఆచార్యులు గజలక్ష్మీ, రజిత, విజయ తదితరులు ఉన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం



సోన్: లెఫ్ట్‌పోచంపాడ్ గురుకుల పాఠశాలలో స్పేస్ చిత్రాలతో విద్యార్థినులు

ముధోల్: చంద్రయాన్–3 విజయంతమైన ఆగస్టు 23న ఏటా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం మండల కేంద్రంలోని రవీంద్ర పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాయినాథ్ , కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ భీంరావుదేశాయి, పోతన్నయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంతోష్, ప్రవీణ్ తదితరులున్నారు

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.ప్రశాంతి మాట్లాడుతూ పాఠశాలలో 32వ బెటాలియన్ ఆదిలాబాద్ ఎన్‌సీసీ కేడెట్ విద్యార్థులతో వ్యాసరచనం, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎన్‌సీసీ అడిషనల్ అధికారి ఎట్టెం రజిత మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయులు విక్టోరియా, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైతుధర్నాకు తరలిన బీజేపీ నేతలు

ఖానాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణం మాఫీ చేయాలనే డిమాండ్‌తో జిల్లాకేంద్రంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఖానాపూర్ నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రితీష్ రాథోడ్, అంకం మహేందర్, ఆకుల శ్రీనివాస్, సంతోష్, దాసరి శ్రీనివాస్, రవి, నరేశ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్వోఆర్ చట్టంపై చర్చ

ముధోల్: మండల కేంద్రంలో ఆర్వోఆర్ ముసాయిదా చట్టంపై శుక్రవారం చర్చా వేదిక నిర్వహించారు. తహసీల్దార్ శ్రీకాంత్‌కు రైతులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరై తమ అభిప్రాయాలు తెలిపారు. ఎంపీడీవో శివకుమార్, విశ్రాంత తహసీల్దార్ వెంకటి, పీఏసీఎస్ డైరెక్టర్లు ధర్మపురి సుదర్శన్, సురేందర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, రైతు నాయకుడు గోపిడి ప్రేమ్‌నాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సోయా పంటలు పరిశీలన

బాసర: మండల కేంద్రంతోపాటు కిర్గుల్(బి)గ్రామంలో సోయా పంటలను ఆదిలాబాద్ వ్యవసాయ (నోడల్) అధికారి శ్రీకర్, ఏ ఈవోలు అజయ్, గంగాధర్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లదోమ వలన సోయా పంటను పల్లాకు తెగులు ఆశిస్తుందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పసుపు రంగులోకి మారిన ఆకులు, మొక్కలను వెంటనే తొలగించాలన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సలహాలను పాటించాలని సూచించారు.

నేడు తైబజార్ వేలం

కుభీర్: మండల కేంద్రంలోని తైబజార్(అంగడి)వేలం శనివారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఈవో రాజేశ్వర్ తెలిపారు. ఆసక్తి కల్గినవారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

బస్‌పాసులు అందజేత

సారంగపూర్: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులకు 50శాతం రాయితీపై ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు, ఆర్టీసీ బస్సుపాస్‌ల ఇన్‌చార్జి టీవీ రమణ బస్సుపాసులను అందజేశారు. ఎంపీఓ అజీజ్ ఖాన్, సూపరింటెండెంట్ లింబాద్రి, ఆర్టీసీ సిబ్బంది, సాయిరెడ్డి, శంకర్, దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు సురేందర్, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఖానాపూర్: మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీవో రత్నాకర్‌రావు, మేడంపల్లి గ్రామ ప్రత్యేకాధికారి మంజుల అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. అంతకుముందు సుర్జాపూర్, కొత్తవాడ గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన, శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడిలో నాటుదాం ఒక చెట్టు–అమ్మ పేరిట కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. గంగాధర్, యోగేశ్, భూమన్న, లచ్చారెడ్డి, నర్సింలు, సాగర్‌రెడ్డి, రాజన్న ఉన్నారు.

నమూనా ఎన్నికలు

కుభీర్: మండలంలోని సొనారి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఎంఈవో చంద్రకాంత్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ సభ్యుడు ఎస్.శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.